# భగవంతునికి ప్రీతికరమైన పుష్పాలు

అహింసా ప్రథమం పుష్పం పుష్పమింద్రియనిగ్రహం
సర్వభూత దయాపుష్పం క్షమాపుష్పం విశేషతః
శాంతి పుష్పం తపఃపుష్పం ధ్యానపుష్పంతథైవచ
సత్యమష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్

ప్రేమస్వరూపులారా! భగవంతుడు మీనుండి ఆశించునది షోడశోప చారములు కాదు; అష్టాదశ పురాణపఠనం కాదు; పవిత్రమైన అష్టవిధ పుష్పములను మాత్రమే తాను మీనుండి ఆశిస్తున్నాడు. ఆ అష్టవిధ పుష్పములు ఎలాంటివి?

మొదటిది అహింసాపుష్పం. మనోవాక్కాయములతో ఏ జీవినీ హింసించకుండా ఉండటమే అహింస. కొందరు కూరగాయలను కోయటం హింసకాదా? అని ప్రశ్నిస్తారు. అది హింస కాదు. ఎందుకంటే, వాటికి బాధ తెలియదు. కొన్ని చెట్లలో కాయ కోసిన చోటనుండి నీరు కారుతుంది. దానిని చూసి కొందరు "అయ్యో పాపం, కాయను కోయటంచేత చెట్టు ఏడుస్తోంది" అనుకుంటారు కాని, అది ప్రకృతిసహజమైన ప్రక్రియయేగాని, శోకబాష్పము కాదు. మనుష్యులకు మాత్రమే అన్నమయకోశము, ప్రాణమయకోశము, మనోమయకోశము, విజ్ఞానమయకోశము, ఆనందమయకోశము అనే పంచకోశములున్నాయి. మనస్సున్నవారికే సుఖదుఃఖములుంటాయి. మానవునికి, పశుపక్షి మృగాదులకు, క్రిమికీటకాదులకు మాత్రమే మనస్సుంది. కూరగాయలకు, వృక్షములకు ప్రాణముందిగాని, మనస్సు లేదు. కనుక వాటికి బాధ తెలియదు.

రెండవ పుష్పం ఇంద్రియనిగ్రహం. ఇంద్రియ నిగ్రహం లేకుండా ఎన్ని సాధనలు చేసినప్పటికీ అవి నిరుపయోగమైపోతాయి. ఇంద్రియాలలో మొట్టమొదట అనేక రుచులకు అలవాటుపడిన జిహ్వను అరికట్టుకోవాలి. "హే జిహ్వా! నీవు పుట్టినప్పటినుండి ఎన్ని బస్తాల గోధుమలు తిన్నావో, ఎన్ని పిండి పదార్థములను ఆరగించావో, ఎన్ని కూరగాయలను భుజించావో! ఇంకనూ నీకు తృప్తి లేదా?" అని మందలించాలి. గోవిందా, దామోదరా, మాధవా

sri sathyasaivachanamrutam

అనే మధురాక్షరములను ఉచ్చరించమని బోధించాలి. “భిక్షాన్నం దేహరక్షార్థం” దేహరక్షణ కోసం భుజించాలి; ఆకలి వేస్తే భుజించాలి. అంతేగాని, రుచులకోసం భుజించకూడదు.

మూడవది సర్వభూత దయాపుష్పం. సర్వ ప్రాణులపట్ల దయ కలిగియుండాలి. ఎవ్వరినీ ద్వేషించరాదు. దీనినే భగవద్గీత “అద్వేష్టా సర్వభూతానాం” అన్నది. అందరిపట్ల ప్రేమతో జీవించాలి. అబూబెనాడమ్ అనే వ్యక్తి నిరంతరము దీనులకు, దిక్కులేనివారికి సేవలు సల్పుతూ ఉండేవాడు. ప్రతిరోజూ బజారులో కనిపించే వృద్ధులకు, వికలాంగులకు సేవలు చేసి రాత్రి చాలా ఆలస్యంగా ఇంటికి చేరుకునేవాడు. ఒకనాటి రాత్రి అతను ఇంటికి చేరుకునేసరికి ఒక దేవతా స్త్రీ ఏదో వ్రాస్తూ కనిపించింది. కొంతసేపు వేచి, వినయవిధేయతలతో “అమ్మా! మీరెవరు? మీరు వ్రాసేదేమిటి?” అని ప్రశ్నించాడు. ఆమె “నాయనా! నేను దేవతా కన్యను. భగవంతుణ్ణి ఎవరు ప్రేమిస్తున్నారో వారి పేర్లు వ్రాస్తున్నాను” అంది. “అందులో నా పేరేమైనా ఉందా?” అని అడిగాడు. ఆమె లేదని సమాధానం చెప్పింది. మరునాటి రాత్రి కూడా అతడు ఇంటికి చేరుకునేసరికి ఆ దేవతాకన్య మళ్ళీ ఏదో వ్రాస్తూ కనిపించింది. “అమ్మా! ఇప్పుడు మీరు వ్రాస్తున్నదేమిటి?” అని అడిగాడు. “నాయనా! నిన్న భగవంతుణ్ణి ఎవరు ప్రేమిస్తున్నారో వారి పేర్లు వ్రాశాను. ఇప్పుడు భగవంతుడు ఎవరిని ప్రేమిస్తున్నాడో వారి పేర్లు వ్రాస్తున్నాను” అంది. “ఇందులోనైనా నాపేరు ఉన్నదా?” అని అడిగాడు. “ఈ లిస్టులో నీపేరే ఫస్టు” అన్నది. దీని అంతరార్థమేమిటంటే, అన్ని పూజలకంటే పరులకు చేసే సేవయే గొప్పది. శ్రవణం, కీర్తనం, విష్ణుస్మరణం, పాదసేవనం, వందనం, అర్చనం, దాస్యం, స్నేహ మాత్మ నివేదనం అనే నవవిధ భక్తిమార్గముల కంటే సేవయే చాలా గొప్పది. అబూబెనాడమ్ నిరంతరము పరులకు సేవ చేయటంచేతనే భగవత్ప్రేమకు పాత్రుడైనాడు. భగవంతుడు లోకంలో అందరినీ ప్రేమిస్తాడు. ప్రేమయే అతని స్వరూపము. అయితే సర్వభూతములపట్ల దయ కలిగి సేవ చేసేవారికి తనను తానే ఇచ్చుకుంటాడు.

నాల్గవది క్షమాపుష్పం. ‘క్షమా పుష్పం విశేషతః’ అన్నారు. ఇది చాలా ప్రధానమైనది; భగవంతునికి అత్యంత ప్రీతికరమైనది. కౌరవులు తమను ఎంతగా బాధించినప్పటికీ, తమ ధర్మపత్నియైన ద్రౌపదిని నిండుసభలో పరాభవించినప్పుడుకూడా ధర్మజుడు ఏమాత్రమూ క్షమను కోల్పోలేదు. ఆ క్షమయే పాండవులను రక్షించి, వారిని ఆదర్శప్రాయులుగా

sri sathyasai vachanamrutam

తనరారజేసింది.

ఐదవది శాంతిపుష్పం. ఎన్ని బాధలు కల్గినప్పటికీ, ఎన్ని ఆటంకములు ఎదురైనప్పటికీ శాంతం వహించాలి. త్యాగరాజు, ద్రౌపది, తుకారాం వంటి పరమభక్తులకు ఎన్ని బాధలో కలిగాయి. కాని అన్నింటియందు వారు శాంతం వహించారు. శాంతము గలవారికే భగవత్కృప లభ్యమౌతుంది. త్యాగరాజు "శాంతము లేక సౌఖ్యము లేదు" అన్నాడు. శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా మానవునికి శాంతి కావాలి. అయితే శాంతి ప్రాపంచిక విషయాలలో లేదు. వస్తువాహనాదులలో లేదు. శాంతి మీయందే ఉన్నది. శాంతిపుష్పము మీ నుండియే ఆవిర్భవించాలిగాని, బయటినుండి లభించేది కాదు. ఈ ప్రాకృత జీవితంలో ఎన్నో ఇక్కట్లు కల్గుతుంటాయి. వాటిని మీరు లెక్కచేయకూడదు. మానవజన్మ పశుపక్షిమృగాదులవలె ప్రాకృతమైన సుఖాలను అనుభవించే నిమిత్తం రాలేదు. హృదయమునుండి ఆవిర్భవించే శాంతిని మీరు అనుభవించాలి.

నిండుసభలో ద్రౌపదికి పరాభవం జరుగుతున్నప్పుడు భీముడు ఉగ్రుడై గద తీసికొని దుశ్శాసనునిపైకి పోయాడు. అప్పుడు ధర్మజుడు అడ్డుకొని "నాయనా! మనం ఓడిపోయినవారము, వారి స్వాధీనంలో ఉన్నవారము. మనకు వారితో యుద్ధంచేసే అధికారం లేదు. కాబట్టి నీవు శాంతం వహించు.ఏనాటికైనా ధర్మమే జయిస్తుంది" అన్నాడు. ఇలాంటి శాంతము అందరికీ ప్రాప్తించదు; ఏ కొద్దిమందికో ప్రాప్తిస్తుంది. శాంతము గలవారికే దైవబలము చేకూరుతుంది, చిరకీర్తి లభిస్తుంది. కౌరవులు నూరుమంది పుట్టారు. పాండవులు ఐదుమందియే. కాని పాండవులకీర్తి సమాజంలో శాశ్వతంగా నిలిచిపోయింది. ధర్మజుడంటే అందరికీ ప్రీతి. "ధర్మ –జ". ధర్మమునుండి పుట్టినవాడు అతను. ధర్మమును ఆచరించాడు కాబట్టే శాంతమును అనుభవించాడు. ఈనాడు ఎక్కడ చూసినా అధర్మమే, అసత్యమే! కనుకనే అశాంతి, అలజడి చెలరేగుతున్నాయి.

ఆరవది తపఃపుష్పం. తపస్సనగా ఏమిటి? అడవులకుపోయి కందమూలాదులను భుజిస్తూ భగవంతుణ్ణి స్మరించటమా? అది నిజంగా తమస్సనే చెప్పవచ్చు. త్రికరణశుద్ధియే తపస్సు. "మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం" అన్నారు. మనస్సును నిరంతరం దైవమునందు ఉంచాలి. సత్త్వరజస్తమోగుణములచేత మనో వాక్కాయములలో కలిగే ఉద్రేకములను అరికట్టాలి.



sri sathyasai vahini.org

సంతోషాన్ని, దుఃఖాన్ని, ఉత్సాహాన్ని, కోపాన్ని అరికట్టుకోవాలి. 'సుఖదుఃఖే సమేకృత్వా లాభాలాభౌ జయాజయౌ' సుఖదుఃఖములను సమదృష్టితో స్వీకరించాలి. అదియే నిజమైన తపస్సు. ఏ సేవ చేసినా వాంఛారహితంగా చేయాలి. వాంఛారహితమైన భావమే తపస్సు.

ఏడవది ధ్యానపుష్పం. ధ్యానమంటే ఏమిటి? పద్మాసనం వేసుకొని, కన్నులు మూసుకొని భగవంతుణ్ణి స్మరించటమా? అది ప్రాకృతమైన ధ్యానము. అదికూడా అవసరమే! కాని, ధ్యానమంటే అది కాదు. పాలలో నీరు ఏకమైనట్లు, మీ మనస్సు భగవంతునిలో లీనం కావాలి. నిప్పులో వేసిన ఇనుము పూర్తి నిప్పుగానే మారిపోతుంది. అట్లే మీ మనస్సు భగవద్భావంలో ఏకమైపోవాలి. దీనినే "బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" అన్నారు. ఉదయం, సాయంకాలం పద్మాసనం వేసుకొని ఏదో కొన్ని నిమిషాలు భగవచ్చింతన చేస్తే, అది ధ్యానమెలా అవుతుంది? సర్వదా సర్వ కాలేషు సర్వత్ర భగవచ్చింతన చేయాలి. ఏ పని చేసినా భగవంతుణ్ణి లక్ష్యంలో పెట్టుకోవాలి. అదియే నిజమైన ధ్యానము. ఏదో కొంత కాలపరిమితి పెట్టుకొని భగవంతుణ్ణి స్మరిస్తే, అది 'పార్ట్ -టైం' భక్తి అవుతుంది. అనుగ్రహమే లభిస్తుంది. భగవదనుగ్రహం శాశ్వతంగా లభించాలంటే 'ఫుల్-టైం' భక్తిని అభివృద్ధిపరచుకోవాలి.

ఎనిమిదవది సత్యపుష్పం. ఇది చాలా ముఖ్యమైనది. ఈప్రపంచము సత్యము నుండియే పుట్టింది, సత్యముచేతనే పోషింపబడుతున్నది, సత్యమునందే ఐక్యమైపోతున్నది. 'త్రికాలాబాధ్యం సత్యం' ఎప్పటికీ మారనిది సత్యం. ఎప్పటికీ ఉండునది సత్యం. సర్వమూ అంతర్ధానమైనా సత్యం మాత్రం శాశ్వతంగా ఉంటుంది. అట్టి సత్యమే భగవంతుడు. కనుక మీరు సత్యముతోనే జీవించాలి. సత్యముతోనే అంత్యమైపోవాలి. ఈ అష్టవిధ పుష్పములతో మీరు భగవంతుణ్ణి పూజించినప్పుడే భగవంతుడు వాటిని ప్రీతితో అందుకొని, మీరు కోరిన వరములనుగ్రహిస్తాడు. భగవంతునికి ప్రీతికరమైన పుష్పములను అర్పించకుండా, వాడిపోయే, రాలిపోయే, కాలిపోయే, కూలిపోయే పుష్పములను ఎన్ని అర్పించినా ప్రయోజనం లేదు.

**ఇంద్రియాలకు బుద్ధి చెప్పాలి**

ప్రతి మానవునికి ఇంద్రియ నిగ్రహం చాలా ప్రధానమైనది. ఇంద్రియనిగ్రహంచేత ఎంతైనా సాధించవచ్చును. ఈనాడు ప్రపంచంలో జరిగే అల్లకల్లోలములకు, అశాంతికి మూలకారణం మానవునికి ఇంద్రియ నిగ్రహం లేకపోవటమే! ఇంద్రియాలకు మీరు బుద్ధి చెప్పాలి. "ఓ

srisatyasaivachanamrutam

నేత్రములారా! మీరు ఇంతవరకు ఎన్నో దృశ్యములను చూశారు. ఇంకా మీకు తృప్తిలేదా? ఇకనైనా, దైవాన్ని చూడటానికి ప్రయత్నించండి" అని నేత్రములకు బోధించాలి. "ఓ శ్రోత్రములారా! మీరు అనవసరమైన విషయాలను వింటున్నారు. ఊరివారి సుద్దులంటే ఎంతో ఆసక్తి కనబర్చుతున్నారు. వాటిని వినటం పట్ల మీకు వచ్చిన ఫలితమేమిటి?" అని శ్రోత్రములను ప్రశ్నించాలి.

ప్రొద్దుబోక ఊరివారి సుద్దులంటే
మీరు సిద్ధమౌదురే కడుశ్రద్ధతోడ
ముద్దుముద్దుగాను భగవత్ ముచ్చటలు చెప్పువేళ
ఒద్దికగ నుండరే చెవులారా!

మీరు వినే విషయాలు, చూసే దృశ్యాలన్నీ మీ హృదయంలో ప్రింటైపోతాయి. హృదయం మాలిన్యమైతే జీవితమే నిరుపయోగమవుతుంది. మొన్న విశాఖపట్నంనుండి వచ్చిన భక్తులకు చెప్పాను – హృదయం ఒక పెన్ను వంటిది. పెన్నుతో వ్రాసే వ్రాతలు గాని, గీసే గీతలుగాని అందులో ఏ రంగు ఇంకునింపితే ఆ రంగునే కలిగియుంటాయి. కనుక, హృదయమనే పెన్నులో ప్రేమ అనే ఇంకుని నింపినప్పుడు మీరు తలచే తలపులు, చెప్పే మాటలు, చేసే చర్యలు అన్నీ ప్రేమమయంగానే ఉంటాయి. ఇట్టి పవిత్రమైన, ప్రేమమయమైన జీవితాన్ని మీరు గడపాలని భగవంతుడు ఆశిస్తున్నాడు. దేవాలయంలో పూజారి భగవంతుణ్ణి అనేక రకములైన పుష్పాలతో పూజిస్తుంటే, భగవంతుడు "ఓ పూజారీ! ఇంతకాలమునుండి నీవు నేర్చుకున్నది ఇదేనా? లారీలకొలది గులాబీ పుష్పాలను, మల్లెపుష్పాలను తెచ్చి నాకు పూజ చేస్తున్నావు. కాని, ఏమి ప్రయోజనం? ఈ పుష్పాలన్నీ రేపటికి వాడిపోతాయి. ఇవి కాదు నాకు కావలసింది. నాకు సత్యపుష్పం కావాలి; శాంతిపుష్పం కావాలి; క్షమాపుష్పం కావాలి. అవి వాడిపోనివి, రాలిపోనివి. ఆ పుష్పాలతో నీవు నాకు పూజ చేయి" అంటున్నాడు.

**భగవంతుడు ఆశించేది సమాజసేవ**

ప్రేమస్వరూపులారా! అనేకమంది ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తుంటారు. కాని, ఇది కాదు భగవంతుడు ఆశించేది. పూజలు మీ వ్యక్తిగతమైన సాధనలకు సంబంధించినవి. భగవంతుడు ఆశించేది సమాజసేవ. సేవచేసినప్పుడే మీరు ఆనందాన్ని అందుకోగలరు.

sri sathyasai vahanamrutam

మీరు పవిత్రమైన హృదయంతో ఎవరికైనా సేవ చేసినప్పుడు వారియొక్క బాధ నివారణ కావటమే కాకుండా, వారిలోకూడ పవిత్రత అభివృద్ధి అవుతుంది. కనుక, మీరు సాత్త్వికభావంతో సమాజసేవలో పాల్గొని ఇతరులనుకూడా సాత్త్వికులుగా మార్చాలి. మీ శక్తికొలది సేవ చేయండి. మీరు ఉదయం, సాయంత్రం భజనలు చేస్తున్నారు. కాని, దానివల్ల కలిగే తృప్తి తాత్కాలికమైనది. పాడేవారికి పాడినంతసేపు తృప్తి, వినేవారికి విన్నంతసేపు తృప్తి. శాశ్వతమైన తృప్తి లభించాలంటే సమాజసేవ చేయాలి.

శంకరాచార్యులవారు చెప్పారు – "మాకురు ధన జన యౌవనగర్వం హరతి నిమేషాత్ కాలస్సర్వం" క్షణభంగురమైనటువంటి యౌవనాన్ని చూసుకొని అహంకారమును, వాంఛలను పెంచుకోకండి. వాంఛలను త్యజించాలి. ఎప్పటికప్పుడు చేయవలసిన పనులు చేయాలి. దేనినీ మనస్సుకు తీసుకోకూడదు. మంచి చెడ్డలు రెండూ భగవంతుని వరప్రసాదములే! ఏది జరిగినా 'ఇది నా మంచి కోసమే' అని భావించాలి. ఊరివారి సుద్దులతో, ప్రాకృతమైన చింతలతో, అపవిత్రమైన భావములతో కాలమును దుర్వినియోగం చేయకండి. కాలమును సార్థకం గావించుకునే నిమిత్తమై సమాజసేవలో పాల్గొనండి. సేవలు చేస్తూ ఉంటే మీలో దుర్భావములు ఆవిర్భవించవు. మీకు ఏ చింతలూ జ్ఞప్తికి రావు. సమాజసేవలో లీనమైన వ్యక్తికి అహంకార, ఆడంబరములు నిర్మూలమౌతాయి; మానసిక పవిత్రత అభివృద్ధి అవుతుంది. సర్వకర్మలూ మనోశుద్ధికోసమే. "చిత్తస్య శుద్ధయే కర్మః". మీరు ఏ సేవలు చేసినా చిత్తశుద్ధికోసమే చేస్తున్నారు. చిత్తశుద్ధి చేకూర్చని కర్మలు చేసి ప్రయోజనమేమిటి? మీరు ప్రాకృతమైన వాంఛలతో ఎంతో ధనమును, కాలమును, శక్తిని వ్యర్థం చేస్తున్నారు. ఏ ఒక్కదానియందైనా శాశ్వతమైన శాంతి ఉన్నదా? శాంతి కదలిపోయే మేఘంవలె వస్తున్నది, పోతున్నది. ఇట్టి తాత్కాలికమైన శాంతినికాదు, మీరు కోరవలసింది. నిత్యసత్యమైన శాంతిని కోరాలి. అది మీ హృదయమునుండియే ఆవిర్భవిస్తుంది.

**భగవంతుడు భావప్రియుడు**

ప్రేమస్వరూపులారా! మానవజన్మ దివ్యమైనది, భవ్యమైనది, నవ్యమైనది, ఎంతో విలువైనది, జీవించతగినది. ఇట్టి పవిత్రమైన జన్మను సార్థకం గావించుకోవాలంటే మొట్టమొదట ఇంద్రియాలను అరికట్టుకోవాలి; "లోకాసమస్తా సుఖినోభవంతు" అని అందరి క్షేమాన్ని

ఆశించాలి. భగవంతుడు 'మీరు ఎన్ని పూజలు చేశారు, ఎన్నివ్రతములు చేశారు, ఎన్ని అర్చనలు చేశారు, ఎన్ని దానధర్మాలు చేశారు' అనేవి చూడడు. "నేను పదిమూటల బియ్యం దానం చేశాను; 500 మందికి చీరలు, పంచెలు ఇచ్చాను" అని లెక్కలు వేయవద్దు. ఈ లెక్కలను కావాలంటే ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారికి వ్రాసుకోవాలిగాని, భగవంతునికి వ్రాయకూడదు. భగవంతునికి ఇవి అక్కర్లేదు. మీరు ఏ భావంతో చేశారు? అనేది మాత్రమే భగవంతుడు చూస్తాడు. కనుక మీరు ప్రేమతో చేయాలి; శాంతంతో చేయాలి; త్యాగభావంతో చేయాలి. అప్పుడే భగవత్ప్రేమకు పాత్రులైనవారి 'లిస్టు' లో మీ పేరు వస్తుంది.

## భగవద్గీతాసారం

భగవద్గీత బోధించేది ఏమిటని ఎవరినైనా ప్రశ్నిస్తే, కొందరు జ్ఞానం బోధించిందంటారు; కొందరు భక్తిని బోధించిందంటారు; కొందరు కర్మమార్గమును బోధించిందంటారు. కాని ఇందులో ఏదీ సరియైన సమాధానం కాదు. భగవద్గీతలో మొట్టమొదటి శ్లోకం ఏమిటి?

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ

ఇంక చిట్టచివరి శ్లోకం ఏమిటి?

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ

చివరి శ్లోకంలోని చివరి పదమును, మొదటి శ్లోకంలోని మొదటి పదమును చేర్చితే "మమధర్మ" అవుతుంది. ఇదే గీతాసారము. అనగా, భగవద్గీత మీ ధర్మాన్ని మీకు బోధిస్తున్నది. ఏమిటి మీ ధర్మము? "నేను మానవుడను, పశువును కాదు" అనే సత్యాన్ని గుర్తించి మానవునిగా బ్రతకాలి; మానవునికి ఉండవలసిన గుణములను పోషించుకోవాలి. మానవునిగా పుట్టి పశువుగా ప్రవర్తించకూడదు; తుచ్ఛమైన, క్షణభంగురమైన భోగభాగ్యములకోసం ప్రాకులాడకూడదు. మానవజన్మ ఎత్తినది శాశ్వతమైన ఆదర్శాన్ని అందించటానికేగాని, భోగభాగ్యములను అనుభవించటానికి కాదు. "ఇంతకాలం బ్రతికినందుకు నేనేమి ఆదర్శము నందించాను?" అని మిమ్ముల్ని మీరు ప్రశ్నించుకోవాలి. ప్రాచీన కాలమునకు చెందిన మహనీయుల పేర్లు ఈనాటికీ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచియున్నాయంటే, దానికి కారణం వారు

sri sathyasai vachanamrutam

చేసిన మంచిపనులే! కనుక, మీరుకూడా మంచిపనులు చేసి మంచిపేరు తెచ్చుకోవాలి. మంచి పనులంటే ఏమిటి? మీకు ఇతరులు ఏదిచేస్తే ఇష్టమో మీరు దానిని ఇతరులకు చేయాలి. ఎవరైనా మీతో అసత్యమాడితే మీకెంత బాధ కలుగుతుంది! కనుక మీరుకూడా ఇతరులతో అసత్యమాడకూడదు. ఇతరులు మీపట్ల ఎలా ఉండాలని ఆశిస్తున్నారో మీరుకూడా ఇతరులపట్ల అలాగే ప్రవర్తించాలి. అదియే మీ ధర్మము. దేహం ఒక నీటిబుడగవంటిది; మనస్సొక పిచ్చికోతి. కనుక దేహసంబంధమైన భోగభాగ్యాలకోసం ప్రాకులాడవద్దు; పిచ్చికోతివంటి మనస్సును అనుసరించవద్దు; అంతరాత్మను తృప్తిపరచండి. భగవంతునికి ప్రీతికరమైన అష్టవిధపుష్పాలను అర్పించండి. అప్పుడే మీ జీవితం ధన్యమౌతుంది.

**(22.8.2000 ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasai vachanamrutam